క్లుప్తంగా

జగనన్నతోనే సంక్షేమ పథకాలు



పెనికలపాడులో ప్రచారంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి

ముద్దనూరు : రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే ప్రజలకు ఎక్కువగా సంక్షేమ పథకాలు అందాయని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పెనికలపాడు గ్రామంలో ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని ఇంటింటి ప్రచారం నిర్వహించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు అందాయని, తిరిగి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడానికి ప్రజలు సహకరించాలని కోరారు. ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనకు, ఎంపీగా పోటీ చేస్తున్న వైఎస్ అవినాష్ రెడ్డికి ఓట్లు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, పార్టీ నాయకులు అట్ల భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ సుధాకర్, శివరామిరెడ్డి, శ్రీనివాసులు, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సింహాద్రిపురం : మండలంలోని అంకాలమ్మ గూడూరులో సోమవారం ప్రభుత్వ హైస్కూల్‌లో 1986–87 సంవత్సరంలో 10వ తరగతి విద్యార్థులు అంకాలమ్మ దేవస్థాన కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సురక్ష ఐ కేర్ పులివెందుల వారు కంటి పరీక్షలను నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు బాబురెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

చీనీ మొక్కలు దగ్ధం




కాలిపోయిన చీనీ మొక్కలు, మొక్కజొన్న పంట

కొండాపురం : మండల పరిధిలోని బి.కొట్టాలపల్లె గ్రామంలో విద్యుదాఘాతంతో తోటలో చీనీ మొక్కలు, డ్రిప్ పరికరాలు దగ్ధం అయినట్లు కంచిమిరెడ్డి చెన్నారెడ్డి సోమవారం తెలిపారు. రెండు ఎకరాల్లో ఏడాది చీనీ తోటలో అంతర్ పంటగా మొక్కజొన్న సాగు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షార్ట్ సర్క్యూట్ సంభవించి ఏడాది చీనీ మొక్కలు, మొక్కజొన్న పంట, డ్రిప్ పరికరాలు, పీవీసీ పైపులు కాలిపోయినట్లు తెలిపారు. సుమారు రూ.1.50 లక్షల నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

వలంటీర్ పదవికి రాజీనామా

వేంపల్లె : స్థానిక 3వ సచివాలయం పరిధిలో వలంటీర్‌గా విధులు నిర్వర్తిస్తున్న డేరంగుల జగదీష్ తన పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీఓ దివిజ సంపతి తన రాజీనామాను ఆమోదించినట్లు చెప్పారు. పులివెందుల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డిల గెలుపు కోసం స్టార్ క్యాంపెయినర్‌గా ఉండి ప్రజలకు, మన ప్రాంతానికి చేసిన అభివృద్ధి గురించి వివరించాలనే ఉద్దేశంతో తాను రాజీనామా చేసినట్లు తెలిపారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలు భారీ మెజార్టీతో గెలుపొందేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. పులివెందుల నియోజకవర్గంలో వలంటీర్ జగదీష్ ఇలాంటి నిర్ణయం తీసుకోవడంపై పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పోలీస్ అనుమతి తప్పనిసరి



ఎస్ఐ హృషికేశ్వర్‌రెడ్డి

కమలాపురం : మండలంలో ఎక్కడైనా సభలు, సమావేశాలు, ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు చేయాలంటే పోలీస్ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ హృషికేశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. కడప సబ్ డివిజన్ పరిధిలో ఈ నెల 30వ తేదీ వరకు సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున ఎవరైనా సభలు, సమావేశాలు, నిరసనలు, ర్యాలీలు చేయాలంటే పోలీస్ స్టేషన్‌లో 24 గంటల ముందు లిఖిత పూర్వకంగా అర్జీ ఇచ్చి అనుమతి తీసుకోవాలని అన్నారు. అనుమతి తీసుకోకుండా ఇలాంటి కార్యక్రమాలు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఊపందుకున్న ఎన్నికల ప్రచారం

- విస్తృతంగా పర్యటిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు
- ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న వైనం
- ప్రజల నుంచి అపూర్వ స్పందన





పులివెందుల టౌన్ : ఎన్నికల ప్రచారంలో ఓట్లు అభ్యర్థిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, చక్రాయపేట : ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైఎస్ కొండారెడ్డి

పులివెందుల టౌన్ : పులివెందుల నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. వైఎస్సార్‌సీపీ నేతలు విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు, అభివృద్ధిపై వివరిస్తున్నారు. దీంతో ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తుంది. సోమవారం పులివెందుల పట్టణంలోని రాజారెడ్డి కాలనీ, సరస్వతి విద్యామందిరం, పార్నపల్లిరోడ్డులో మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి .. మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, పౌర సరఫరాల సంస్థ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ చిన్నప్పతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల కోసం అందించిన సంక్షేమ పాలన వైపే ప్రజలు మొగ్గుచూపుతున్నారని పేర్కొన్నారు. అసెంబ్లీకి పోటీ చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, పార్లమెంటుకు పోటీ చేస్తున్న వైఎస్ అవినాష్‌రెడ్డికి మీ అమూల్యమైన రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి, వేయించి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన పథకాలే ఆయనను మళ్లీ సీఎంగా నిలుపుతాయన్నారు. రాష్ట్ర ప్రజలు ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసేందుకు ఎదురుచూస్తున్నారన్నారు. ప్రజలు ప్రతి ఒక్కరూ మీ ఓటుతో పాటు ఇతరులతో కూడా జగనన్న సంక్షేమ పాలనను వివరిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయించాలని అభ్యర్థించారు. మళ్లీ మంచి రోజులు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ ఇన్‌చార్జి పార్నపల్లి కిశోర్, వైఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరారెడ్డి, కోఆప్షన్ చంద్రమౌళి, వైఎస్సార్‌సీపీ నాయకులు మధు, భాస్కర్‌రెడ్డి, కొగనపల్లె మురళి, తోటంశెట్టి హరి, జశ్వంత్‌రెడ్డి, మహేశ్, కోడిరమణ, ఖాదర్‌వలి, నాగరాజు, ప్రశాంత్ శ్రీరాములు, పద్మనాభరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి జగనన్నకే సాధ్యం

చక్రాయపేట : ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడం, రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమే ముఖ్యమంత్రి జగనన్న ధ్యేయమని చక్రాయపేట మండల ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన మండలంలోని సురభి గ్రామం లక్ష్మీపురం పాయలపల్లె ఊటుకూరువాండ్ల పల్లె, బోడిగుండుపల్లె, మహబూబ్‌నగర్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటి వద్దకు వెళ్లి వారి క్షేమసమాచారాలను అడిగి తెలుసుకోవడమే కాకుండా జగనన్న చేసిన లబ్ధిని, అభివృద్ధిని వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభివృద్ధి చేయడం, ప్రజలకు ఆర్థిక లబ్ధి చేకూర్చేందుకు అనేక రకాల సంక్షేమ పథకాలను ఇవ్వడం అనేది ఒక్క జగనన్నకే సాధ్యమైందని చెప్పారు. తెలుగుదేశం ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు లేవని, అభివృద్ధి జరిగింది ఏమీ లేదని చెప్పారు. వారి పాలన అంతా మోసాలతోనే గడిపారని, వారి మాయమాటలను నమ్మొద్దని చెప్పారు. ఫ్యాన్‌గుర్తుకు ఓటు వేసి మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకుందామని, అవినాష్‌రెడ్డిని ఎంపీగా గెలిపించుకుందామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బెల్లం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ శివప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ మాధవి బాలకృష్ణ, సర్పంచ్ శ్రీనివాసులు, సింగిల్‌విండో అధ్యక్షులు సురేష్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షులు వేదమూర్తి, జేసీఎస్ కన్వీనర్ రామాంజులరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

లింగాల : మండలంలో మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వైఎస్ అభిషేక్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చురుగ్గా సాగుతోంది. ఆయన అంబకపల్లె గ్రామంలో సోమవారం సాయంత్రం ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ కరపత్రాలను అందిస్తూ ప్రజలకు మరింత సేవలు అందించేందుకు సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీగా వైఎస్ అవినాష్‌రెడ్డిని ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఐదేళ్ల పాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ ముందుకు సాగారు. వచ్చే ఐదేళ్లలో మరిన్ని అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు అందాలన్నా, పథకాలు నేరుగా లబ్ధిదారుల ఇళ్లకే చేరాలన్నా తిరిగి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పీవీ సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ కడప పార్లమెంటరీ కన్వీనర్లు సారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మండల యూత్ కన్వీనర్ మనోహర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ అంబకపల్లె గ్రామ నాయకులు బాబురెడ్డి, వెంగల్‌రెడ్డి, బండి శ్రీనివాసరెడ్డి, తేజేశ్వర్‌రెడ్డి, గంగిరెడ్డి, నాగభూషణ్‌రెడ్డి, చెన్నకేశవులరెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కర్నా రమేష్‌కుమార్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, మండలంలోని వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్రం అభివృద్ధి

సింహాద్రిపురం : రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే సీఎంగా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రావాలని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి బావమరిది, ఎన్నికల పరిశీలకులు గండ్లూరి వీరశివారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని సుంకేసుల, తెలికి గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాలకు సమన్యాయంతో పాటు కులమతాలకు అతీతంగా ప్రజా సంక్షేమానికి బాటలు వేసిన గొప్ప వ్యక్తి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. కూటమి పేరుతో ప్రతిపక్షాలు మీ ముందుకు వస్తున్నాయని, అలాంటి వారిని నమ్మవద్దన్నారు. ఇంటింటికి వెళ్లి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించి కరపత్రాలను ప్రజలకు అందించారు. పులివెందుల ఎమ్మెల్యే అభ్యర్థిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థిగా వైఎస్ అవినాష్ రెడ్డిలను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రామ్మోహన్‌రెడ్డి, కిశోర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, శివప్రసాద్ రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, నారాయణ రెడ్డి, అనిల్‌రెడ్డి, భార్గవ్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బాబురెడ్డి, ఓబులేశు, మహేశ్వరరెడ్డి, చెన్నకేశవరెడ్డి, శివారెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, చంద్రమౌళిరెడ్డి, పార్థసారథిరెడ్డి, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



లింగాల : వృద్ధుడికి కరపత్రం అందిస్తున్న వైఎస్ అభిషేక్‌రెడ్డి



సింహాద్రిపురం : ప్రచారం నిర్వహిస్తున్న ఎన్నికల పరిశీలకులు గండ్లూరి వీరశివారెడ్డి

అవ్వాతాతల గోడు తగలక తప్పదు

- టీడీపీ అధినేత చంద్రబాబుపై ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ధ్వజం

వీరపునాయునిపల్లె : రాష్ట్రంలోని అవ్వా తాతలు, వికలాంగులు, వితంతువుల గోడు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకు తగలక తప్పదని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఉరుటూరు గ్రామంలో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై మీ అమూల్యమైన ఓటును వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. సంక్షేమ పథకాలు నిరంతరాయంగా కొనసాగాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని వారికి సూచించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అవ్వాతాతలు, వికలాంగులు, వితంతువుల కష్టాలు తెలుసుకొన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్‌ల ద్వారా ప్రతి నెల 1వ తేదీ ఉదయం సూర్యుడు ఉదయించక ముందే తలుపు తట్టి పింఛన్ పంపిణీ నిర్వహించడం జరిగేదని తెలిపారు. వలంటీర్ల ద్వారా పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ఆపేయాలని చంద్రబాబునాయుడు మద్దతుదారులు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. దీంతో వలంటీర్‌ల ద్వారా పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ఆపేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసిందని తెలియజేశారు. అంతే కాకుండా వలంటీర్ల వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకోవాలని, ప్రభుత్వ అధికారులు మాత్రమే పింఛన్ పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. అవ్వాతాతలకు మూడు నెలలు కష్టాలు తప్పవని తెలిపారు. సంక్షేమ పథకాల పంపిణీకి అడ్డుకట్ట వేసిన చంద్రబాబుకు లబ్ధిదారులు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజల బాగోగుల గురించి ఆలోచించే జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకొనేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలియజేశారు. ప్రచారం నిర్వహించేందుకు గ్రామాల్లోకి వెళ్తున్న సమయంలో బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవి, ఉప సర్పంచ్ చంద్రఓబుల్‌రెడ్డి, ఎంపీటీసీ లక్ష్మీ రామాంజనమ్మ, స్థానిక నాయకులు గంగిరెడ్డి, వెంకటరామిరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, గంగా ప్రసాద్ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, గంగిరెడ్డి, సురేష్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పింఛన్ల పంపిణీపై వివరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

పెండ్లిమర్రి : పవిత్ర రంజాన్ మాసంలో జరిగే ఇఫ్తార్ విందు మతసామరస్యానికి ప్రతీక అని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం కొండూరు గ్రామంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకుడు షబ్బీర్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై విందులో పాల్గొన్నారు. ఈమాసంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం ఎంతో పుణ్య కార్యమన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, జేసీఎస్ కన్వీనర్ అమర్‌నాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజారెడ్డి, సుబ్బరామిరెడ్డి, అల్లాబకాష్, జహీర్, హుస్సేన్, రామలింగారెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రదాతకు అండగా నిలుద్దాం

చెన్నూరు : నవరత్నాల రూపకర్త, సంక్షేమ, అభివృద్ధి ప్రదాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ప్రజలు ఆశీర్వదించాలని కమలాపురం శాసనసభ్యులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి తనయుడు చింతకొమ్మదిన్నె జెడ్పీటీసీ పి.నరేన్ రామాంజులరెడ్డి అన్నారు. సోమవారం మండల వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం జోరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఉప్పరపల్లె గ్రామపంచాయతీలోని నరసారెడ్డిపల్లె, దుగ్గనపల్లె గ్రామాలలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఆయన ఇంటింటికి వెళ్లి ఆ ఇంటికి జరిగిన మేలును వచ్చిన సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డిని, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆదరించాలని, వైఎస్సార్‌సీపీకి ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి కమలాపురం నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపారన్నారు. అందరికీ అందుబాటులో ఉంటూ ఏ సమస్య ఉన్నా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళితే వెంటనే స్పందించి పరిష్కరించారన్నారు. ఆయనను మండల ప్రజలు ఆశీర్వదించి అత్యధిక మెజారిటీతో మూడవసారి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు గుమ్మ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, గాజులపల్లె సంపూర్ణరెడ్డి, ఎర్రసాని రాజగోపాల్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, కొండారెడ్డి, ఓబులరెడ్డి, పుల్లారెడ్డి, రమణారెడ్డి, వీరారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, నాగ సుబ్బారెడ్డి, సాయిరెడ్డి, నవనీశ్వర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, రఘు, నాగేంద్రరెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, జీఎన్ భాస్కర్‌రెడ్డి, ఆర్ వీఎస్ఆర్, ముదిరెడ్డి సుబ్బారెడ్డి, జేసీఎస్ టౌన్ కన్వీనర్ శ్రీనివాసరాజు, గుమ్మల మధుసూదన్‌రెడ్డి, మెడికల్ రవి, సొసైటీ అధ్యక్షులు అల్లి శ్రీరామమూర్తి, వైఎస్ఆర్‌సీపీ విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి గుమ్మల్ల సాయికుమార్ రెడ్డి, నాయకులు సత్యరాజు, ప్రదీప్‌కుమార్‌రెడ్డి, నిత్య పూజయ్య, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న నరేన్ రామాంజులరెడ్డి

వైఎస్సార్‌సీపీలో చేరిన మాజీ కౌన్సిలర్



జమ్మలమడుగు : ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సమక్షంలో చేరిన మాజీ కౌన్సిలర్ కుటుంబ సభ్యులు

జమ్మలమడుగు : నాగులకట్టకు చెందిన మాజీ కౌన్సిలర్ గంజికుంట రామలక్షుమ్మతోపాటు ఆమె కుటుంబ సభ్యులు సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి సమక్షంలో గంజికుంట రామలక్షుమ్మ, ఇందిర, చంద్రగోవిందు, బాల గోవిందుతో పాటు వారి అనుచరులు వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం శాయశక్తులా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ, పరిశీలకుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ముల్లాజానీ, పోరెడ్డి మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్ఆర్‌సీపీలో చేరిక

చక్రాయపేట : మండలంలోని సురభి గ్రామం బోడిగుండుపల్లెకు చెందిన పలువురు సోమవారం టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. బోడిగుండుపల్లెకు చెందిన సానె పాలకొండయ్య, సానె కొండయ్య, సానె చిన్నప్పరెడ్డి మరికొన్ని కుటుంబాల వారికి మండల ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ శివప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ మాధవి బాలకృష్ణ, మండల ఉపాధ్యక్షులు వేదమూర్తి, సింగిల్‌విండో అధ్యక్షులు సురేష్‌రెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జ్యోతి ఉత్సవాలు



చౌడేశ్వరీదేవి గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

వల్లూరు : మండలంలోని దుగ్గాయపల్లెలో శ్రీ చౌడేశ్వరీదేవి జ్యోతి ఉత్సవాలను సోమవారం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా తెల్లవారుజామున అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. శ్రీ చౌడేశ్వరీదేవి పులి వాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో అమ్మవారి గ్రామోత్సవం అత్యంత ఘనంగా సాగింది. భక్తులు దారి పొడవునా నీళ్లు చల్లుతూ అమ్మవారికి తమ గృహాల వద్ద స్వాగతం పలికారు. బ్యాండు వాయిద్యాలతో, బాణా సంచా పేలుస్తూ గ్రామోత్సవం సాగింది. అందంగా అలంకరించిన జ్యోతులను తలపై పెట్టుకున్న భక్తులు అమ్మవారి పాటలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ గ్రామోత్సవం వెంట సాగారు. కొందరు భక్తులు కర్రలను భుజాలపై పెట్టుకుని నిలవగా జ్యోతులను తలపై పెట్టుకుని కర్రలపై నిలుచొని చేసిన విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులు కాయ కర్పూరాలు ఇచ్చి బలిదానాలను సమర్పించారు. మహిళలు బోనపు కడవలను తలపై పెట్టుకుని అమ్మవారి వెంట తిరిగారు. గ్రామదేవత ఎదుట ఉదయం జ్యోతులను ఆర్పే కార్యక్రమం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఖడ్గ పద్యాలు, కత్తి సాములతో కార్యక్రమాన్ని పూర్తి చేశారు.



కర్రలపై నిలుచొని జ్యోతులతో విన్యాసాలు చేస్తున్న భక్తుడు

క్రీడా రంగం అభివృద్ధికి సదుపాయాలు

పులివెందుల రూరల్ : పులివెందుల జేఎన్టీయూ కళాశాలలో క్రీడారంగం అభివృద్ధికి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నట్లు అనంతపురం జేఎన్టీయూ వైస్ చాన్సలర్ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం పులివెందుల జేఎన్టీయూ కళాశాలలో క్రీడా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలపై ప్రోత్సాహం పెంపొందించే విధంగా అన్ని సదుపాయాలు కల్పిస్తామన్నారు. విద్య, ఆరోగ్యం, వృత్తిపై దృష్టి సారించి లక్ష్యాన్ని చేరుకోవడానికి క్రీడలు ఎంతో అవసరమన్నారు. జీవితంలో ఉన్నత శిఖరాలు చేరేందుకు చదువుతో పాటు ఆట, పాటలు కూడా ఉపయోగపడుతాయన్నారు. ప్రతి మనిషిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుందన్నారు. ఆ ప్రతిభకు కృషి తోడైతే సాధించలేనిది ఏదీ ఉండదన్నారు. అనుకున్న లక్ష్యాలను నెరవేర్చేందుకు క్రమశిక్షణ ఎంతో అవసరమన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ రమణారెడ్డి మాట్లాడుతూ క్రీడల ద్వారా పట్టుదల, కార్యసిద్ధి మెరుగుపడి ఒత్తిడిని జయించవచ్చన్నారు. ఎందరో క్రీడాకారులు సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు, సాంకేతిక సహకారం లేని రోజుల్లో దేశప్రతిష్టను నిలబెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌చార్జి దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న వీసీ శ్రీనివాసరావు

పొలాలకు నిప్పు.. విద్యుత్‌కు అంతరాయం



కాలిపోయిన తీగలు

చెన్నూరు : మండలంలోని చినమాచుపల్లె గ్రామ పొలాలలో కొందరు ఆకతాయిలు అగ్గిపెట్టడం వల్ల మంటలు చెలరేగి 33 కేవీ లైన్ల కింద, అలాగే చుట్టుపక్కల వ్యాపించి విపరీతమైన ఉష్ణోగ్రత చెందడం వల్ల 33 కెవి ఇన్సులేటర్లు పగిలిపోవడం జరిగిందని ట్రాన్స్‌కో ఏఈ రామలింగారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సోమవారం ఉదయం 10 గంటలకు చిన్నమాచుపల్లె పరిధిలోని పంట పొలాల్లో కొంత మంది ఆకతాయిలు అగ్గిపెట్టడంతో పంట పొలాల్లోని చుట్టుపక్కల మంటలు చెలరేగి అక్కడే ఉన్న 33 విద్యుత్ లైన్లకు, అలాగే విద్యుత్ తీగలకు మంటలు వ్యాపించడం వల్ల అదే విధంగా విపరీతమైన ఉష్ణోగ్రతల వల్ల 33 కెవి విద్యుత్ లైన్ల తీగలు సాగిపోయి విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడిందని తెలిపారు. తమకు విషయం తెలియగానే సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేసి కాలిపోయిన తీగలను సరి చేశామన్నారు. మధ్యాహ్నం రెండున్నర గంటలకు విద్యుత్ సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకున్నట్టు ఆయన తెలిపారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయండి

వేంపల్లె : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ దివిజ సంపతి ఆదేశించారు. సోమవారం ఆమె టెలికాన్ఫరెన్స్ ద్వారా ఆయా గ్రామాల సచివాలయ కార్యదర్శులు, సర్పంచులతో మాట్లాడారు. ప్రస్తుతం వేసవి రీత్యా ఎండలు విపరీతంగా పెరిగాయని, దీంతో ప్రజలు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను తక్షణమే ప్రారంభించాలని సూచించారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, తగు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని కోరారు.


చీనీకి తెగులు.. రైతుకు దిగులు



బంక తెగులు సోకిన చీనీ చెట్లు

పులివెందుల రూరల్ : చీనీతోటలకు బంక తెగులు సోకడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బంక తెగులు సోకడం వల్ల చీనీ చెట్లు వాడిపోతున్నాయి. సీజన్‌లో తెగులు సోకడంతో దిగుబడి తగ్గి నష్టం వచ్చే ప్రమాదం ఉందని చీనీ రైతులు ఆందోళన చెందుతున్నారు. నియోజకవర్గంలోని పులివెందుల, సింహాద్రిపురం, తొండూరు, లింగాల మండలాల్లోని గ్రామాల్లో వేలాది ఎకరాల్లో చీనీ సాగు చేస్తున్నారు. చేతికి అందే సమయంలో బంక తెగులు సోకి చెట్లన్ని ఎండిపోతున్నాయని రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత వేసవిలో వర్షం వస్తే చీనీ చెట్లకు బంక తెగులు సోకకుండా కాపాడుకోవచ్చని రైతులు అంటున్నారు.

గ్రామాల్లో సమస్యలు సృష్టిస్తే చర్యలు



పెద్దదండ్లూరులో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

జమ్మలమడుగు : గ్రామాలలో సమస్యలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని అర్బన్ సీఐ కరుణాకర్ పేర్కొన్నారు. సోమవారం సమస్యాత్మక గ్రామాలైన పెద్దదండ్లూరు, దానవుల పాడు, సున్నపురాళ్లపల్లి, సిరిగేపల్లి గ్రామాలలో కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలో ప్రజలు కలసిమెలసి ఉండాలే తప్ప ప్రతి చిన్న విషయానికి సమస్యలు తీసుకుని రావడం సరైంది కాదన్నారు. ఏమైనా సమస్యలుంటే వెంటనే తమ దృష్టికి తీసుకు రావాలని సూచించారు. గ్రామంలో శాంతి కమిటీని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజల మధ్య ఎటువంటి చిచ్చులు పెట్టినా, సమస్యలు సృష్టించే వారిపై ప్రత్యేక నిఘా ఉంచడం జరిగిందన్నారు.

వ్యక్తి అరెస్ట్

కడప అర్బన్ : కడప నగరంలోని రైల్వేస్టేషన్ సమీపంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న యూసఫ్ అనే వ్యక్తిని సీఐ సీ. భాస్కర్ రెడ్డి తమ సిబ్బందితో కలిసి సోమవారం అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 40 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బైపాస్‌లో ఆర్బీ సమీపంలో వరదరాజులు అనే వ్యక్తి అక్రమంగా బీర్ బాటిళ్లను తరలిస్తుండగా సీఐ నరసింహారెడ్డి తమ సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 19 బీర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.